క్లీన్ మున్సిపాలిటీకి కృషి చేయాలి

- ఎమ్మెల్యే చినరాజప్ప,
- మున్సిపల్ చైర్‌పర్సన్ పిలుపు
- 'కోట'లో స్వచ్ఛత హీ సేవా ర్యాలీ



సామర్లకోటలో రోడ్డును శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే రాజప్ప, చైర్‌పర్సన్, కమిషనర్ తదితరులు



సామర్లకోట రైల్వే స్టేషన్ ఆవరణలో స్వచ్ఛ సేవ ప్రతిజ్ఞ చేసిన రైల్వే ఉద్యోగులు, ప్రయాణికులు

సామర్లకోట: క్లీన్ మున్సిపాలిటీకి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. దేశ వ్యాప్తంగా జరుగుతున్న స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం జరిగిన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛతపై అవగాహన పెంచుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉండడం ద్వారా రోగాలను నివారించడానికి అవకాశం ఉంటుందన్నారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా చెత్త రహిత పట్టణం తయారు చేయడానికి శ్రమదానం చేయడానికి ముందుకు రావాలన్నారు. ఇండియన్ స్వచ్ఛత లీగ్ పోటీల్లో పట్టణానికి ఉత్తమ ర్యాంకు సాధించడానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. ఈ మేరకు స్థానిక స్టేషన్ సెంటర్ నుంచి గాంధీచౌక్ వరకు రోడ్లను శుభ్రం చేశారు. గాంధీచౌక్‌లో గాంధీ విగ్రహం వద్ద స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ గోకిన సునేత్రాదేవి, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు, కౌన్సిలర్లు స్వయంభారపు వీరభద్రరావు, సేపెని సురేష్, బలుసు వాసు, గొర్రెల విజయలక్ష్మీ, మాజీ మున్సిపల్ చైర్మన్ గోలి వెంకట అప్పారావు చౌదరి, మాజీ వైస్ చైర్మన్ యార్లగడ్డ చిన్ని, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, సీఐ ఎ.కృష్ణభగవాన్, ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు, మెప్మా సీటీ మిషన్ మేనేజరు సుజాత, మున్సిపల్, మెప్మా అధికారులు, సచివాలయ కార్యదర్శులు, మహిళా సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం హుస్సేన్‌పురం గ్రామంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛత ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ డి.శ్రీలలిత, ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత రైల్వే స్టేషన్‌గా..

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌ను ప్లాస్టిక్ రహిత రైల్వే స్టేషన్‌గా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాజమహేంద్రవరం ఏడీఈఈ బి.వేణుగోపాలాచారి, రైల్వే డివిజనల్ అసిస్టెంట్ ఇంజినీర్ బి.శ్రీనివాసరావు, స్టేషన్ మేనేజర్ ఎం రమేష్ అన్నారు. సోమవారం స్థానిక రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛత హీ సేవా పక్షోత్సవాలను నిర్వహించారు. ఈ మేరకు రైల్వే స్టేషన్ ఆవరణలో రైల్వే ఉద్యోగులు, సిబ్బంది, ప్రయాణికులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. దీనిలో భాగంగా రైల్వే ప్రయాణికులకు క్లాత్ బాగ్‌లను పంపిణీ చేశారు. అక్టోబరు 2 నుంచి రైల్వే స్టేషన్ ఆవరణలో పూర్తిగా ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉంటుందన్నారు. అప్పటి వరకు ప్రతి రోజు ప్రజలను, ప్రయాణికులను చైతన్య పరచడానికి నిత్యం ఓ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛత అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాట్‌ఫాం శుభ్రం చేశారు. చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్, ఆర్పీఎఫ్ ఎస్సై పి.రామకృష్ణ, జీఆర్పీ ఎస్సై బి.లోవరాజు, హెల్త్ ఇన్‌స్పెక్టరు కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ పెద్దాపురానికి సహకరించండి

పెద్దాపురం: స్వచ్ఛ పెద్దాపురం సాధనకు ప్రతి ఒక్కరూ సహకరించి, ప్రస్తుత సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. స్వచ్ఛతా హి సేవలో భాగంగా మంగళవారం మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రజలచే స్వచ్ఛ సేవ ప్రతిజ్ఞ చేయించారు. పట్టణ పరిశుభ్రతకు ప్రతీ ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు పాల్గొన్నారు.

భవిత సేవలను సద్వినియోగం చేసుకోవాలి



భవిత సెంటర్‌లో ఫిజియోథెరపీ చికిత్సను పరిశీలిస్తున్న నాగేశ్వరరావు

పెద్దాపురం: విభిన్న ప్రతిభా వంతులకు ప్రభుత్వం భవిత సెంటర్ల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ ప్రభాకర శర్మ అన్నారు. స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ పాఠశాలలోని భవిత సెంటర్ విభిన్న ప్రతిభావంతులకు అందిస్తున్న సేవలపై మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విభిన్న ప్రతిభా వంతులకు విద్యా శాఖ ద్వారా పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. సెంటర్ ద్వారా అర్బన్, రూరల్ పరిధిలో విభిన్న ప్రతిభా వంతులైన విద్యార్థులకు మెరుగైన వైద్య, విద్య సౌకర్యం కల్పించినట్టు తెలిపారు. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం విభిన్న ప్రతిభావంతుడైన విద్యార్థికి అందిస్తున్న ఫిజియోథెరపీ ప్రక్రియను పరిశీలించి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భవిత ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్‌రెడ్డి, బి.ఆనందరావు, ఫిజియోథెరపీ వైద్యులు అపర్ణ, భవిత సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

వీధిలైట్లు వెలిగించరూ



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేసిన మానవహక్కుల సంఘ నాయకులు

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో అనేక ప్రాంతాల్లో వీధిలైట్లు వెలగడం లేదని, దాని వల్ల పట్టణంలో దొంగతనాలు పెరిగిపోతున్నాయని జిల్లా మానవహక్కుల సంఘ అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్యకు వినతి పత్రం అందజేశారు. మూడో వార్డులో జెడ్పీ బాలికోన్నత పాఠశాల ప్రాంతంలో గత మూడు నెలలుగా వీధిలైట్లు వెలగడం లేదన్నారు. గతంలో జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో కంప్యూటర్ చోరీకి గురైందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ప్రాంతంలో వీధిలైట్లు వెలిగేలా చూడాలన్నారు. అలాగే పారిశుధ్యం అధ్వానంగా ఉందని ఆరోపించారు. దోమల మందు పిచికారీ చేయకపోవడం వల్ల దోమలు పెరిగి అంటువ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.రెహమాన్ పాల్గొన్నారు.

మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కామరాజు మృతి



కామరాజు (ఫైల్)

పెద్దాపురం: స్థానిక పాత పెద్దాపురానికి చెందిన మున్సిపల్ మాజీ కౌన్సిలర్ తోట కామరాజు (92) మంగళవారం మృతి చెందారు. ఆయనకు ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. అపర భగీరథుడు ముప్పన రామారావు మున్సిపల్ చైర్మన్‌గా పనిచేసిన సమయంలోనూ, తాళ్లూరి గంగాభవాని మున్సిపల్ చైర్మన్‌గా కొనసాగిన సమయాల్లో ఈయన రెండు పర్యాయలు కౌన్సిలర్‌గా బాధ్యతలు నిర్వహించారు. మరో రెండుసార్లు మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులుగా కొనసాగారు. ఆయన మృతికి ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, కౌన్సిలర్లు ఆరెళ్ళి వీర్రాఘవులు, ఆకుల కృష్ణబాపూజీ, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోట సోనీ, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ తోట చంటిబాబు, సీపీఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు తదితరులు సంతాపం తెలియజేశారు.

రూ.36 వేలకు గణపతి లడ్డూ వేలం



వేలంలో లడ్డూను దక్కించుకున్న మనోజ్‌కుమార్

కొత్తపల్లి: గణపతి నవరాత్రులు ముగింపు సందర్భంగా మండలంలో ఏర్పాటు చేసిన గణపతి ఆలయాలు, మందిరాలు వద్ద ఉంచిన లడ్డూలకు ఉత్సవ కమిటీ, ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పాట నిర్వహించారు. స్థానిక శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన లక్ష్మీగణపతి మందిరం వద్ద లడ్డూను హైదరాబాదుకు చెందిన దుంప మనోజ్‌కుమార్ రూ.36 వేలకు దక్కించుకున్నారు.

పట్టణంలో పందులు తిరిగితే చర్యలు

సామర్లకోట: పట్టణ పరిధిలో పందులు తిరగడం వలన ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకుని పందుల పెంపకందారులు వాటిని నియంత్రించాలని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య సూచించారు. ఈ నెల 21వ తేదీలోపుగా పందులను అదుపు చేయకపోతే చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. వీధులలో, జనసంచారం మధ్య పందులు తిరగడం వల్ల మెదడు వ్యాపు వ్యాధి వంటి వ్యాధులు వస్తున్నాయని ఫిర్యాదులు రావడంతో పందుల పెంపకందారులకు హెచ్చరిక జారీ చేస్తున్నట్టు తెలిపారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా పందులు జనవాసాల మధ్య తిరగకుండా జాగ్రత్తలు చేసుకోవాలన్నారు. అవి పట్టణంలో తిరిగితే మున్సిపల్ చట్టం ప్రకారం పెంపకందారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

చెట్టు పడి కారు ధ్వంసం



కారుపై పడిన చెట్టును పరిశీలించిన ఎస్సై గరగారావు, మున్సిపల్ సిబ్బంది

సామర్లకోట: స్థానిక 26వ వార్డు అంబటి ఆయిల్ వెనుక భాగంలో నివసిస్తున్న అత్తిలి సతీష్ కారుపై మంగళవారం రాత్రి చెట్టు పడి కారు పైభాగం నజ్జు నజ్జు అయింది. తన ఇంటి వద్ద కారు పార్క్ చేసిన సమయంలో ఎటువంటి గాలి లేని సమయంలో గానుగ చెట్టు పడిపోయిందని అతడు వాపోయాడు. సంఘటనా ప్రదేశానికి ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు, మున్సిపల్ సిబ్బంది చేరుకున్నారు. మున్సిపల్ సిబ్బంది కారుపై పడిన చెట్టును తొలగించారు.

మోదీ సేవలు అభినందనీయం



రక్తదాన శిబిరంలో తుమ్మల పద్మజ, బీజేపీ నాయకులు

పెద్దాపురం: కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తుమ్మల పద్మజ అన్నారు. మోదీ 73వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక రోటరీ క్లబ్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మజ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కరోన విపత్కర పరిస్థితుల్లో ప్రజలందరికీ ఉచితంగా వాక్సినేషన్ అందించారంటే అది మోదీ ఘనతేనన్నారు. జన్మదిన వేడుకలు 15 రోజుల పాటు నిర్వహించనున్న నేపథ్యంలో తొలిరోజు రక్తదాన శిబిరంతో ఉత్సవాన్ని ప్రారంభించామని పద్మజ అన్నారు. కార్యక్రమంలో దొరయ్య, రవికృష్ణ, సతీష్, ప్రసాద్, అన్నపూర్ణ, నాని, అనూష తదితరులు పాల్గొన్నారు.

కుల, మతాలకు అతీతంగా విశ్వకర్మ జయంతి



విశ్వకర్మకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే చిన రాజప్ప

పెద్దాపురం: కుల, మతాలకు అతీతంగా విశ్వకర్మ జయంతిని ఏటా నిర్వహిస్తున్నట్టు జరుగుతుందని ఎమ్మెల్యే చినరాజప్ప అన్నారు. విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో నిర్వహించిన జయంత్యుత్సవాల్లో మున్సిపల్ మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవస్థానం కమిటీ అధ్యక్షుడు తాళాబత్తుల సాయి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వృత్తిని బట్టి కులం ఏర్పడిందని, ఏ కులమువారైనా, ఏమతము వారైనా సర్వమత సామరస్యాన్ని పాటిస్తూ ఐకమత్యంతో జీవించాలన్నారు. పెద్దాపురంలో ఏటా కుల, మతాలకు అతీతంగా విశ్వకర్మ జయంతి నిర్వహించడం అభినందనీయమన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి విశ్వకర్మ జయంతి ఉత్సవాలను చినరాజప్ప ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చిట్టిమోజు శ్రీను, వేముల అర్జునరావు, చిట్టిమోజు లక్ష్మీనారాయణ, బంగారు సత్యనారాయణ, చిప్పాడ బుజ్జి, ధవళేశ్వరపు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

శునకాలను నియంత్రించరూ

- గుంపులుగా సంచరిస్తూ కరుస్తున్న వైనం
- రోజురోజుకూ పెరుగుతున్న బాధితులు



రోడ్లపై సంచరిస్తున్న కుక్కలు

కొత్తపల్లి: మండల పరిధిలో రాత్రి పగలు తేడా లేకుండా కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తూ ప్రజలను గాయాలపాలు చేస్తున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. పాదచారులతో పాటు ద్విచక్ర వాహనాల వెంట పడి దాడిచేస్తుండడంతో ప్రజలు ఆస్పత్రి పాలవుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులకు సైతం కుక్కలు పిక్కలు లాగేస్తున్నాయి. ప్రధాన కూడళ్లు, మాసం దుకాణాలు, చేపల మార్కెట్‌లలో అధికంగా కుక్కలు సంచరిస్తున్నాయి. వెంటాడి సైతం దాడి చేస్తు గాయాల పాలుచేస్తున్నాయి. వాహనాలపై వెళ్లే వారిని సైతం వదలకుండా తరిమితరిమి కరుస్తున్నాయి. కుక్కల దాడి నుంచి రక్షించుకునే ప్రయత్నంలో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. మండలంలో ఉప్పాడ, కొత్తపల్లి, అమీనాబాదు, మూలపేట, కొండెవరం, కొమరగిరి, నాగులాపల్లి తదితర గ్రామాల్లో సైతం కుక్కల దాడిలో గాయపడే రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రజల భద్రతను గుర్తించి పంచాయతీ అధికారులు కుక్కల బారినుంచి రక్షించాలని పలువురు కోరుతున్నారు. మండలంలోని కొత్తపల్లి, కొమరగిరి, నాగులాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించి గత నెల రోజులుగా సుమారు 350 కేసులు నమోదైనట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ముఖ్యంగా కుక్క కాటుతో ఎక్కువగా చిన్నారులు, వృద్ధులు వైద్యానికి వస్తున్నారని తెలియజేశారు.

నివారణ చర్యలు చేపట్టాలి



ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్న కుక్కల నిర్మూలనకు అధికారులు చర్యలు తీసుకోవాలి. రాత్రి పగలు తేడా లేకుండా కుక్కలు గ్రామాల్లో సంచరిస్తున్నాయి. బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. పిల్లలను బయటకు పంపాలంటే భయపడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కటారి శ్రీను, కొమరగిరి

నులి పురుగుల నివారణపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తూ పోస్టర్లు ప్రదర్శిస్తున్న వైద్య సిబ్బంది

పిఠాపురం: స్థానిక ఇంద్రనగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం డాక్టర్ జయరాం ఆధ్వర్యంలో నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు వైద్య సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం రోజున 1-2 సంవత్సరాల పిల్లలకు సగం టాబ్లెట్ 2- 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు పూర్తి టాబ్లెట్ ఇవ్వనున్నట్టు తెలిపారు. సంబంధిత ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, వైద్య బృందం విద్యార్థులను సమీకరించి తల్లిదండ్రులు ప్రజలను సమీకరించి మందుల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. పాఠశాలలు, కాలేజీలలో పిల్లలు తల్లిదండ్రులతో ఆరోగ్య విద్య గురించి మాట్లాడి వారికి నులి పురుగుల నివారణ ఆవశ్యకతను వివరించాలన్నారు. హ్యాండ్ వాష్, బ్యాలెన్స్ డైట్, శుభ్రమైన పాత్రల్లో మధ్యాహ్న భోజనం అందించడంపై అవగాహన కల్పించాలన్నారు. నులి పురుగుల నివారణ మాత్రలు సురక్షిత మంచినీటితో మాత్రమే వేసేలా చూడాలని ఆ విధంగా చేసేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. నులి పురుగుల నివారణ మాత్రలు వేసి నప్పుడు ఏదైనా ప్రతిచర్యలను గమనించినట్లయితే వెంటనే వైద్య సిబ్బందికి సమాచారం ఇచ్చి తగిన చర్యలు తీసుకునేలా చూడాలన్నారు. నులి పురుగుల మందుల పంపిణీ తర్వాత నిర్ణీత ఫార్మాట్‌లో లబ్ధిదారుల నివేదికను సంబంధిత పీహెచ్‌సీకి అందించాలని ఆయన వైద్య సిబ్బందికి సూచించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు పిల్లల జాబితాను నిర్ణీత ఫార్మాట్‌లో జిల్లా అధికారులకు పంపాలని ఆదేశించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం రోజున హాజరుకాని పిల్లల కోసం ఈనెల 25న మళ్లీ మందు పంపిణీ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్‌ల కుదింపునకు రంగం సిద్ధం

- నవర కాంప్లెక్స్ మార్పుపై వివాదం
- ఎంఈఓను నిలదీసిన గ్రామస్తులు
- ఇది కేవలం ప్రతిపాదన మాత్రమే అని చెప్పడంతో శాంతించిన ప్రజలు



నవర హైస్కూల్ వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

సామర్లకోట: రాష్ట్ర వ్యాప్తంగా స్కూల్ కాంప్లెక్స్‌ల కుదింపుకు రంగం సిద్ధమైంది. దీనిలో భాగంగా మండల పరిధిలో ఉన్న స్కూల్ కాంప్లెక్స్‌లను కుదించడానికి ఆయా స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలోని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభిప్రాయాలను తీసుకున్నారు. 20 వేల జనాభాకు ఒక స్కూల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించి ఆయా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు నిర్ణయం తీసుకోనున్నారు. ప్రభుత్వం నుంచి ఏడాదికి తప్పని సరిగా స్కూల్ కాంప్లెక్స్‌లకు రూ.కోటి నిధులు విడుదల అవుతాయి. ఈ మేరకు మండల పరిధిలోని నవర స్కూల్ కాంప్లెక్సును మార్చాలని నిర్ణయించడంతో ఆ స్కూల్ వద్ద ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. మండల పరిధిలో జి.మేడపాడు, వేట్లపాలెం, మాధవపట్నం, నవర స్కూల్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. జి.మేడపాడు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో పీబీ దేవం, మేడపాడు, జి.కొత్తూరు గ్రామాల్లో ఉన్న స్కూళ్లు వస్తాయి. అలాగే వేట్లపాలెం స్కూల్ కాంప్లెక్స్‌లో వేట్లపాలెం, హుస్సేన్‌పురం గ్రామాలకు చెందిన పాఠశాలలు వస్తాయి. మాధవపట్నం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో వీకే రాయపురం, మాధవపట్నం, ఉండూరు, కాపవరం గ్రామాలకు చెందిన స్కూల్స్ వస్తాయి. నవర కాంప్లెక్స్ పరిధిలో పనసపాడు, అచ్చంపేట, గొంచాల, నవర, పవర, చంద్రంపాలెం గ్రామాలలోని పాఠశాలలు ఉన్నాయి, అయితే జి. మేడపాడు స్కూల్ కాంప్లెక్స్‌ను వేట్లపాలెం స్కూల్ కాంప్లెక్స్‌లో విలీనం చేశారు. నవర స్కూల్ కాంప్లెక్స్‌ను ఉండూరు హైస్కూల్‌లో ఏర్పాటు చేయడానికి హెచ్‌ఎం సంతకం చేయడంతో ఆ గ్రామ ప్రజలు హైస్కూల్ వద్ద ఆందోళనకు దిగారు. దాంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఈ మేరకు మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్యను గ్రామస్తులు నిలదీశారు. ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న స్కూల్ కాంప్లెక్సను మార్చడం సరి కాదన్నారు. కాంప్లెక్స్ ఏర్పాటుకు పాఠశాలలో అన్ని మౌలిక సదుపాయాలు ఉండాలని, ఈ మేరకు ఉండూరు హైస్కూల్‌లో అవన్నీ ఉండటంతో మార్చడానికి ప్రణాళిక తయారు చేసినట్టు ఎంఈఓ గ్రామస్తులకు వివరించారు. అయినప్పటికీ తాము అంగీకరించేది లేదని గ్రామస్తులు భీష్మించారు. దాంతో విషయాన్ని జిల్లా ఉప విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావుకు ఎంఈఓ వివరించారు. ఇది కేవలం ప్రతిపాదన మాత్రమేనని, గ్రామస్తులకు అంగీకారం లేకపోతే మార్పు ఉండదని చెప్పాడంతో గ్రామస్తులు శాంతించారు. కాగ మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటి వరకు ఒకే స్కూల్ కాంప్లెక్స్ ఉండగా దానిని రెండు స్కూల్ కాంప్లెక్స్‌లకు పెంచారు. అయితే పట్టణంలో జనాభా 60 వేలు ఉండటంలో మూడు స్కూల్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది.

ఉత్తీర్ణులూ.. ఇదిగో ఉపాధి..

- జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళాలు
- ప్రతి నెలా 2 నుంచి 3 మేళాల నిర్వహణ
- ఉపాధి కార్యాలయానికి వెళ్లకుండా రిజిస్ట్రేషన్
- 2023-24 ఉత్తీర్ణులకు ఆహ్వానం

బాలాజీచెరువు: పదో తరగతి, ఆపై ఇంటర్‌మీడియెట్, డిప్లమో, ఐటీఐ, ఇంజినీరింగ్, డిగ్రీ ఉత్తీర్ణత సాధించారా.. అయితే జిల్లా ఉపాధి కార్యాలయం మీకు ఉపాధి కల్పిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ శాఖలో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ పోర్టల్ సత్ఫలితాలు ఇస్తోంది. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు మరింత చేరువ చేయడానికి కార్యాలయం శిక్షణ శాఖ ఆధ్వర్యంలో గత ఏడాది ఆన్‌లైన్ వెబ్ పోర్టల్ ప్రారంభించింది. రాష్ట్రంలో ప్రైవేట్ కంపెనీలలో ఖాళీగా ఉన్న ఉద్యోగ వివరాలు, ప్రభుత్వ శాఖల్లో జారీచేసిన నోటిఫికేషన్ల వివరాలు పొందుపరిచారు. నిరుద్యోగ యువత వారి విద్యార్హతలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే వెంటనే వారి విద్యార్హత వివరాల మేరకు అర్హులకు వారి మొబైల్ నెంబర్‌తో పాటు రిజిస్టర్ ఈ-మెయిల్ ఐడీకి సమాచారం అందుతుంది. ప్రైవేట్ కంపెనీల్లో ఖాళీలు భర్తీ చేయడానికి ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాల సమాచారం, ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాల ఖాళీల భర్తీకు జారీ చేసే నోటిఫికేషన్ల సమాచారం ఈ వెబ్‌సైట్‌లో ఎప్పటికప్పుడు నవీకరిస్తున్నారు.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి




ఈ వెబ్‌పోర్టల్ యువతకు ఎంతో ఉపయోగం. విద్యకు తగ్గ ఉపాధి కల్పించే దిశగా కృషిచేస్తున్నాము. అర్హులు రిజిస్ట్రేషన్ చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం. జిల్లాలో అన్ని ప్రముఖ, ప్రైవేట్ సంస్థలతో అనుసంధానమై ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాము.

– జి.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి

ఆధార్, ఫోన్ నెంబరుతో వెబ్‌పోర్టల్ లాగిన్..

- ఇంటర్‌నెట్‌లో ఎంప్లాయిమెంట్ ఏపీ.జీవోవీ.ఇన్‌లో జాబ్‌సీకర్‌లో ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్ ద్వారా లాగిన్ అవ్వాలి.
- వారి విద్యార్హతలు, వివరాలు నమోదు చేసిన వెంటనే వారి మొబైల్‌కు సమాచారం వస్తుంది. వివరాలు నమోదు చేసిన వెంటనే సంబంధిత జిల్లా ఉపాధి కార్యాలయానికి ఆ వివరాలు చేరతాయి.
- ఎంప్లాయిమెంట్ శాఖ కార్యాలయంలో సిబ్బంది ఎప్పటికప్పుడు వాటిని పరిశీలించి అన్నీ సక్రమంగా ఉంటే రిజిస్ట్రేషన్ నంబరుకు అభ్యర్థిని పంపుతారు.
- ఏమైనా వివరాలు తప్పుగా ఉంటే, ఇంకా సమాచారం కావాలన్న ఉపాధి కార్యాలయ సిబ్బంది ఫోన్ ద్వారా వివరాలు తెలియజేస్తారు.



జిల్లా ఉపాధి కార్యాలయం

ఉపాధి కార్యాలయంలో విద్యార్హతల వారీగా నమోదు వివరాలు..

పదో తరగతిలోపు	490
పదవ తరగతి	6420
ఇంటర్‌మీడియట్	7340
డిగ్రీ	6890
డిప్లమో	3519
ఇతర విద్యార్హతలు	17,560

- ఎంప్లాయిమెంట్ శాఖ కార్యాలయంలో నిర్వహించే విద్యార్హత పత్రాల రిజిస్ట్రేషన్, రెన్యూవల్ అదనపు విద్యార్హతల నమోదు వంటి సేవలు ఈ పోర్టల్‌లో ఉన్నాయి.
- ఈ వెబ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుంటే కేవలం రెండు రోజుల్లో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ కార్డు అందుతుంది.
- ఏ విద్యార్హత లేనివారు వివరాలు నమోదు చేసుకోవచ్చు. వారి విద్యతో సంబంధం లేని ఉపాధి కల్పిస్తారు.
- ప్రతి విద్యార్థికి డిజిటల్ కార్డు.. ఉపాధి కల్పనశాఖలో ఇప్పటి వరకూ వివరాలు నమోదు చేసుకున్న వారికి గుర్తింపు సంఖ్యతో పాటు ధృవపత్రం ఇచ్చేవారు. ఇకపై ఎంసీసీ విధానంలో ధృవపత్రాలు ఇవ్వకుండా రిజిస్ట్రేషన్‌లు చేస్తారు.